## కేటీఆర్‌ను కలిసిన బీఆర్‌ఎస్ నాయకుడు

వెల్దండ, జూలై 25 : మండలంలోని రాఘాయిపల్లికి చెందిన బీఆర్‌ఎస్ మండల యూత్ నాయకుడు గణేశ్ గురువారం బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఆయనను కలిసిన గణేశ్ బోకే అందజేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో సెల్ఫీ దిగి ఆనందం వ్యక్తం చేశారు.


కేటీఆర్‌కు బొకే అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న గణేశ్

## కృష్ణానదిపై తీగల వంతెన నిర్మాణం చేపట్టాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్ రావు

కొల్లాపూర్, జూలై 25 : తెలుగు రాష్ట్రాలను కలిపే జాతీయ రహదారి 167కే కనెక్టింగ్ సోమశిల, సిద్దేశ్వరం గ్రామాల సమీపంలోని కృష్ణానదిపై ఐకానిక్ తీగల వంతెన నిర్మాణం చేపట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏల్లేని సుధాకర్ రావు కేంద్ర రావాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని మాజీ బీసీ కమిషన్ సభ్యుడు ఆచారితో కలిసి కోరారు. గురువారం ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి జాతీయ రహదారి 167కేను మంజూరు చేసినందుకు నల్లమల ప్రాంత ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ రహదారి పనులు శరవేగంగా జరుగుతున్నట్లు వారు కేంద్ర మంత్రికి వివరించారు. సోమశిల, సిద్దేశ్వరం వంతెనతో రెండు తెలుగు రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయన్నారు.


కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో బీజేపీ నాయకులు

**కేంద్రమంత్రికి వినతి**

కల్వకుర్తి, జూలై 25 : కేంద్ర రోడ్డు రవాణ శాఖ మంత్రి నితిన్‌గడ్కరిని గురువారం జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి మర్యాదపూర్వకంగా కలిశారు. తుక్కుగూడ నుంచి కల్వకుర్తికి ఆరులైన్ల రహదారి నిర్మించాలని, కల్వకుర్తి నుంచి శ్రీశైలం వరకు నాలుగులైన్ల్ రహదారిని మంజూరు చేయాలని మంత్రికి ఆచారి వినతిపత్రం ఇచ్చారు. అదేవిధంగా జాతీయ రహదారి 167కే జాతీయ రహదారి పనులు శరవేగంగా సాగుతుండడంతో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సుధాకర్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

## కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

కొల్లాపూర్, జూలై 25: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందని సీపీ ఎం మండల కార్యదర్శి శివవర్మ అన్నారు. గురువారం కొల్లాపూర్‌లోని ఎన్టీఆర్ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు కు జాతీయ హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. పీఆర్‌ఎల్‌ఐకు జాతీయ హోదా ఇవ్వకుండా కేంద్రం తెలంగాణ రైతాంగాన్ని మోసం చేసిందన్నారు. బీజేపీకి ఎనిమిది మంది ఎంపీలు ఉన్న తెలంగాణకు జీరో బడ్జెట్ కేటాయించడం సిగ్గుచేటని పేర్కొన్నారు. రాష్ట్రానికి బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సలీం, బాలపీరు, రాముడు, సత్యనారాయణ, కృష్ణ, రాజు, సురేందర్, సంజీవ్, సాయిరాం, మధు, వెంకటస్వామి పాల్గొన్నారు.


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

## కేంద్ర బడ్జెట్‌లో గిరిజనులకు అన్యాయం

కొల్లాపూర్, జూలై 25 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరిగిందని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశోక్ నాయక్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్లమెంట్‌లో బడ్జెట్‌పై ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ అవాస్తవాలు మాట్లాడారన్నారు. బడ్జెట్‌లో అంకెల గారడీ పాల్పడినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ బడ్జెట్‌లో వెనకబడిన గిరిజన తెగల అభివృద్ధికి కేవలం రూ.20కోట్లు మాత్రమే కేటాయించడం సిగ్గుచేటన్నారు.

## స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలి

పెద్దకొత్తపల్లి, జూలై 25 : దివ్యాంగులను అవమానపర్చిన ఐఏఎస్ అధికారి ణి స్మితా సబర్వాల్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మండల దివ్యాంగుల సంఘం ఆధ్వర్యం లో ఎస్సై సతీశ్‌కుమార్‌కు గురువారం ఫిర్యాదు చేశా రు. ఈ సందర్భంగా దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల మతి స్థిమితం కోల్పోయి అవమానంగా మాట్లాడడం పట్ల చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాములు, శిరీష పాల్గొన్నారు.


ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న దివ్యాంగులు

## డబుల్ బెడ్రూం ఇండ్లలో అధికారుల తనిఖీ

అచ్చంపేటటౌన్, జూలై 25 : అచ్చంపేట పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లల్లో అవకతవకలు జరిగాయనే నేపథ్యంతో అధికారులు గురువారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా డబుల్ బెడ్రూం ఇండ్లలో అలాట్‌మెంట్ అయిన వారు అక్కడ నివసిస్తున్నారా లేదా అని క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించారు. తనిఖీలో భాగంగా లబ్ధిదారులకు అందజేసిన ధ్రువపత్రంతోపాటు, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు కృష్ణాజీ, జూనియర్ అసిస్టెంట్లు కుర్మయ్య, శంకర్, ఆంజనేయులు, మున్సిపల్ వార్డు అధికారులు శంకర్, సాజీద్, మహమూద్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

## బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలి

కల్వకుర్తిరూరల్, జూలై 25 : 317 జీవో ప్రకారం ఉపాధ్యాయుల బదిలీలను అర్హులైన వారికి పారదర్శకంగా నిర్వహించాలని టీయూటీఎఫ్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శైలం, రవీందర్ గురువారం కోరారు. ఇటీవల జరుగుతున్న ఉపాధ్యాయ బదిలీల్లో ఎలాంటి అవకతవలు జరగకుండా అర్హులైన వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం బదిలీలు చేయాలని వారు కోరారు.

**నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్**

**డాక్యుమెంట్ పోయినది**

వుడుతల భాస్కర్ తండ్రి లేట్ జంగా రావు, వయస్సు: 53, నివాసము: ఇంటి నెం. 1-5-73/2/బి, న్యూటౌన్, మహబూబ్‌నగర్ జిల్లా గారి సర్వే నెం. 565/ఈ విస్తీర్ణం ఎ.0.30 గుంటలు (పాస్ బుక్ నెం. టి01020011634, ఖాతా నెం.2663) పత్రాలు కలిగి ఉన్న అగ్రికల్చర్ ఆస్తికి సంపూర్ణ యజమాని, సాధారణ ప్రజలకు దీని ద్వారా తెలియజేయునది ఏమనగా. సర్వే నెం.565/ఈ, విస్తీర్ణం ఎ.0.30 గుంటలు (పాస్ బుక్ నెం. టి01020011634, ఖాతా నెం.2663) ఒరిజినల్ డాక్యుమెంట్స్ నెం.1830/2021 వారం రోజుల క్రితం పోయినది. కావున ఎవరికైన దొరికినచో అట్టి ఒరిజినల్ డాక్యుమెంట్ కాపీలను ఈ క్రింది అడ్రస్‌కు పంపగలరు.

**వుడుతల భాస్కర్ తండ్రి లేట్ జంగా రావు, వయస్సు: 53, నివాసము: ఇంటి నెం.1-5-73/2/బి, న్యూటౌన్, మహబూబ్‌నగర్ జిల్లా గారి సెల్ నెం. 9346794570.**

**ప్రకటన**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified 4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line 50/- Only
For Advertisement Enquiry Please Contact...
9182777641
9182777654
9182777794

# రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

- కలెక్టర్ బాదావత్ సంతోష్

కల్వకుర్తి, జూలై 25 : ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ సంతోష్ వైద్యులను ఆదేశించారు. గురువారం కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ దవాఖానను కలెక్టర్ తనిఖీ చేశారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్య సిబ్బందిని విధులకు హాజరైన వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజూ ఎంతమంది రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారని దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ శివరాంను అడిగారు. అనంతరం ఆసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్, రాజీవ్ ఆరోగ్యశ్రీ కేంద్రం, డయాలసిస్ కేంద్రం, ఓపీ, అత్యవసర విభాగాలను పరిశీలించారు. దవాఖానలోని రక్తనిధి కేంద్రాన్ని పరిశీలించి రక్త నిల్వలు, ఆసుపత్రిలో ఎప్పుడు ఎన్ని రకాల రక్త నిల్వలు అందుబాటులో ఉంచుకోవాలని డాక్టర్లను ఆదేశించారు. ఆసుపత్రిలో పాముకాటుతో చికిత్స పొందుతున్న వెల్దండ మండలం కోనేటి తండాకు చెందిన లోక్యానాయక్, మరికొంత రోగులతో కలెక్టర్ మాట్లాడారు. వైద్య సేవలు అందుతున్న తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు. రోగులకు వై ద్యులు నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా ఎంతమందికి వైద్య సహాయం అందించారని, కలెక్ట ర్ వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట డాక్టర్లు శివరాం, అన్నపూర్ణ, స్వర్ణలత, రోహిత్, వైద్య సిబ్బంది ఉన్నారు.


కల్వకుర్తి : సీఎం సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

**సీఎం పర్యటనకు ఏర్పాట్లు చేయాలి**

కల్వకుర్తి, జూలై 25 : కల్వకుర్తిలో ఈనెల 28వ తేదీన నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి సభ ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని కలెక్టర్ బా దావత్ సంతోశ్ అధికారులను ఆదేశించారు. కొ్ట్ర గేట్ వద్ద కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి విగ్రహావిష్కరణ అనంతరం కల్వకుర్తిలో బీఎస్‌ఎన్‌ఎల్ స్థలంలో సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగసభ నిర్వహిస్తున్న నేపథ్యంలో గురువారం కలెక్టర్ సంతోష్ ఏర్పాట్లను పరిశీలించారు. సీఎం బహిరంగ సభ పరిశీలించిన కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. బహిరంగసభలో వీఐపీ గ్యాలరీ, ముఖ్యమంత్రి సభ స్థలం, ప్రజలకు కావాల్సిన ఏర్పాట్లపై అధికారులకు పలు సలహాలు ఇచ్చారు. ముఖ్యమంత్రి సభా వేదికను రానున్న మూడు రోజుల పాటు వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకుని అందుకు అనుకూలమైన స్థలంలో ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్డీవో శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ అశ్రిత్‌కుమార్, వెల్దండ, కల్వకుర్తి తాసీల్దార్‌లు రవికుమార్, ఇబ్రహీంలు ఉన్నారు.

## తిమ్మాజిపేటలో గ్రామసభ

తిమ్మాజిపేట, జూలై 25 : మండల కేంద్రాన్ని ఓడీఎఫ్ ప్లస్ గ్రామంగా ప్రకటించిన నేపథ్యంలో గురువారం స్థానిక గ్రామ పంచాయతీలో ఎంపీడీవో లక్ష్మీదేవి ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ తిమ్మాజిపేటలో ప్రతిఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్డి వినియోగిస్తున్నారని, తడి, పొడి చెత్తను వేరు చేసి గ్రామ పంచాయతీ సిబ్బందికి అందించడంతోపాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడంతో తిమ్మాజిపేటకు ఓడీఎఫ్ ప్లస్‌గా గుర్తింపు వచ్చిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పీఏసీసీఎస్ బ్యాంక్‌లో తనిఖీలు

అచ్చంపేటరూరల్, జూలై 25 : ప్రాథమిక సహకార పరపతి బ్యాంక్‌ను మండల వ్యవసాధికారి కృష్ణయ్య గురువారం తనిఖీ చేశారు. రైతుల రుణమాఫీ విషయంలో రైతులకు సలహాలు సూచనలు చేశారు. రూ.లక్షలోపు రుణాలు తీసుకున్న రైతుల పేర్లుల వచ్చిన వారందరికీ సకాలంలో రుణాలు అందించాలని సీఈవో ఎల్లయ్యను ఆదేశించారు.

## రైతు బీమాను సద్వినియోగం చేసుకోవాలి

ఊర్కొండ/లింగాల, జూలై 25 : రైతు బీమాను సద్వినియోగం చేసుకోవాలని, రైతుబీమాలోని సవరణలు సరి చేసుకోవాలని ఊర్కొండ ఏఈవో అరుణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన రైతుబీమా దరఖాస్తుల స్వీకరణలో భాగంగా మండల కేంద్రానికి చెందిన రైతుల దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఏఈవో అరుణ మాట్లాడుతూ 2024 జూన్ 28 నాటికి కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు వచ్చిన రైతులు రైతుబీమా కోసం ఆగస్టు 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు బీమా పతకానికి అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని లింగాల మండల ఏవో నాగార్జున రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని వల్లభాపూర్ రైతు వేదికలో రైతు బీమా దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో బీమా పథకానికి దరఖాస్తులు చేసుకున్న రైతులు నామిని చనిపోయినా, పేర్లల్లో తప్పు ఒప్పులు ఉంటే ఈనెల 30వ తేదీలోగా సరి చేసుకోవాలన్నారు.

## పొలం విక్రయించారని ఫిర్యాదు

తిమ్మాజిపేట, జూలై 25 : పొలం తనకు విక్రయిస్తానని మరొకరికి విక్రయించడంతో ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మరికల్ గ్రామానికి చెందిన పీర్యా అదే గ్రామ శివారులో ఒక ఎకరం పొలం చౌటచెరువు తండాకు చెందిన వ్యక్తి 2012లో విక్రయించేందుకు తన నుంచి రూ.1.70లక్షలు తీసుకున్నట్లు తెలిపారు. అయితే ఆ పొలం లావుని పట్టా అని రిజిస్టర్ చేయలేదని, ఈ విషయం 2022లో పీర్యా కోర్టు వెల్లగా, పొలం రిజిస్టర్ చేస్తానని అక్కడ అంగీకరించి, ప్రస్తుతం పొలం ధర పెరిగిందన అందుకు బదులుగా మరోచోట ఉన్న పీర్యాకు చెందిన ఎకరం తనకు రిజిస్టర్ చేయాలని కోరగా, దానికి అంగీకరించిన తర్వాత, అతనికి తెలియకుండా ఈ నెల 16న మరొకరి విక్రయించాడని పీర్యా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెల్లడించారు.

## మహిళ మృతి

కోడేరు, జూలై 25 : పాము కాటుకు గురై చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందిన ఘ టన మండల పరిధిలోని సింగాయిపల్లిలో చో టు చేసుకున్నది. గ్రామస్తుల కథనం మేరకు సింగాయిపల్లికి చెందిన రాసోజు వడ్లగోవిందమ్మ(58) ఈనెల 21వ తేదీన రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా మధ్య రాత్రి 1గంట సమయంలో పాముకాటుకు గురైంది. వెంటనే కుటుంబీకులు వనపర్తి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో డాక్టర్లు మహబూబ్‌నగర్‌కు రెఫర్ చేశారు. అక్కడ పరీక్షించిన వైద్యులు హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానకు మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేశారు. గాంధీ దవాఖానలో చికిత్స పొందుతు గురువారం మధ్యాహ్నం మృతి చెందింది.

## నాణ్యమైన భోజనం పెట్టాలి

బల్మూరు, జూలై 25 : ప్రభుత్వ వసతిగృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని ఎంపీడీవో రాఘవులు అన్నారు. గురువారం మండలకేంద్రంలోని కాస్తూర్బా గాంధీ పాఠశాలల్లో ఆయన మధ్యాహ్నం భోజనం, తాగు నీరు వసతులను, రికార్డులను పరిశీలించారు.

# సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

కల్వకుర్తి రూరల్, జూలై 25 : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తోటపల్లి పీహెచ్‌సీ వైద్య వైద్యుడు శరత్‌కుమార్‌రెడ్డి కోరారు. గురువా రం కల్వకుర్తి మండలం తోటపల్లి గ్రామంతోపాటు పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో సోకే వ్యాధు లు, వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. కార్యక్రమం లో వైద్య సిబ్బంది మంగమ్మ, శ్రీనివాసులు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.


కల్వకుర్తి రూరల్ : తోటపల్లిలో సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

**అమ్రాబాద్‌లో..**

అమ్రాబాద్, జూలై 25 : జిల్లా వైద్యారోగ్య శాఖ ఆదేశాల మేరకు మండలంలోని వటవర్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గ్రామంలో ఇంటింటి ఫీవర్ సర్వేను గురువారం నిర్వహించినట్లు వైద్యులు అభిలాశ్ తెలిపారు. ఇందులో భాగంగా గ్రామంలో వైద్యారోగ్య శాఖ సిబ్బంది ఇంటింటికి తిరిగి ఇళ్లల్లో జ్వరంతో బాధపడుతున్న వారి పేర్లను నమోదుచేసుకొని మందులు అందజేశారు. పరిసరా ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది హరిలాల్, లోక్యానాయక్, హన్మంతు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజలకు సేవలందించడమే ఫౌండేషన్ లక్ష్యం

వెల్దండ, జూలై 25 : పేద ప్రజల సంక్షేమాభివృద్ధి ఐక్యత ఫౌండేషన్ లక్ష్యమని ఆ సంస్థ చైర్మన్, ఎన్నారై సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. గురువారం వెల్దండలోని ఏవీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఐక్యత ఫౌండేషన్, శంకర నేత్రాలయ చెన్నై వారి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 7వ రోజు కంటి వైద్య శిబిరాన్ని ఐక్యత చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 7రోజుల్లో మొత్తం 1900 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా, 1100 మందికి ఉచితంగా కంటి అద్దాలు అందజేశామని, 136మందికి ఆపరేషన్లు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో శంకర నేత్రాలయ మెంబర్ అరుణ్‌కుమార్, అనిల్‌గౌడ్, శ్రీరాములు, వెంకట్‌రెడ్డి, నరేందర్‌గౌడ్, మల్లయ్య, రమేశ్‌నాయక్, కొండల్, మహేశ్, రాహుల్, యూసుఫ్, శ్రీపతి ఉన్నారు.


వైద్యశిబిరంలో కంటి అద్దాలు అందజేస్తున్న రాఘవేందర్‌రెడ్డి

## గ్రామంలో సమస్యలను పరిష్కరించాలి


పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కోడేరు, జూలై 25 : మండలంలోని మాచుపల్లి గ్రామంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నాయకులు గ్రామస్తులు గురువారం ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు పేరుపోయిందని, నాలుగేళ్ల కిందట విద్యుత్ దీపాల కోసం నాటిన విద్యుత్ స్తంభాలకు నేటికీ విద్యుత్ తీగలు అమర్చకపోవడంతో ఆయా కాలనీ ప్రజలు అంధకారంలో కొట్టుమిట్టాడుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ, నాయకులు శివశంకరవరప్రసాద్, బుద్ధయ్య, రాములు, రాములు పాల్గొన్నారు.

## నల్లబెల్లం పట్టివేత

అచ్చంపేటరూరల్, జూలై 25 : మండలంలోని మన్నెవారిపల్లి చౌరస్తాలో గురువారం వాహనాలను తనిఖీ చేస్తుండగా నల్లబెల్లం పట్టుకున్నట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు. వాహనాల తనిఖీ చేస్తుండగా నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలం చెన్నారం గ్రామానికి చెందిన ఆంగోత్ తరుణ్, దేవరకొండ మండలం పోలేపల్లికి చెందిన రామవత్ నాగరాజు అశోక్ లేలాండ్ వాహనంలో 6క్వింటాళ్ల నల్లబెల్లం, 40కేజీల స్పటికను తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. దాడుల్లో కానిస్టేబుల్స్ హరినాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

## నేటి కేజీబీవీ సరుకుల టెండర్ ప్రక్రియ వాయిదా

నాగర్‌కర్నూల్‌టౌన్, జూలై 25 : జిల్లాలోని కస్తూర్బా బాలికల విద్యాలయాలు (కేజీబీవీ), అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ (యూఆర్‌ఎస్)కు ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన వివిధ సరుకుల సరఫరా కోసం ఈ నెల 26వ తేదీన నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సీతారామారవు ఆధ్వర్యంలో నిర్వహించనున్న టెండర్లను తెరిచే ప్రక్రియను వాయిదా వేసినట్లు డీఈవో గోవిందరాజులు గురువారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 20 కేజీబీవీలకు, ఒక అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలకు 2024-25 విద్యా సంవత్సరానికి సరుకులు, పండ్లు, కూరగాయలు, గుడ్లను పంపిణీ చేసేందుకు టెండర్ దాఖలు చేసిన టెండర్ దారులు కేజీబీవీల ప్రత్యేక అధికారులు ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు. టెండర్లను తెరిచే తదుపరి తేదీని తర్వాత ప్రకటించనున్నట్లు డీఈవో తెలిపారు.

## రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదు


నాగర్‌కర్నూల్‌టౌన్ : సభ్యత్వ నమోదు చేపడుతున్న నాయకులు

నాగర్‌కర్నూల్‌టౌన్, జూలై 25 : మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) ఉపాధ్యాయ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మురళి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను తీర్చుటకు విశేషంగా ఎస్టీయూ సంఘం కృషి చేస్తుందని, ప్రతి ఉపాధ్యాయుడు సంఘంలో సభ్య త్వ నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మద్దిలేటి, కరుణాకర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

**ఉప్పునుంతలలో..**

ఉప్పునుంతల, జూలై 25 : మండల కేం ద్రంతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లోని పాఠశాలలో పీఆర్టీయూ సభ్యత్వ నమో దు కార్యక్రమాన్ని చేపట్టినట్లు పీఆర్టీయూ జి ల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. పీఆర్టీయూ కృషితోనే రాష్ట్రవ్యాప్తంగా 25వేల మంది ఉపాధ్యాయులు పదోన్నతులు, బదిలీలు పొందారన్నారు. కార్యక్రమంలో నాయకులు బిచ్యానాయక్, మల్లికార్జున్ ఉన్నారు.

## పీఆర్సీని ప్రకటించాలి

కొల్లాపూర్, జూలై 25 : ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో ప్రభుత్వం చర్చలు జరిపి 2023 జూలై నుంచి పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని వెంటనే అమలు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కొల్లాపూర్ మండలంలోని వివిధ పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను కూడా విడుదల చేయాలన్నారు. కార్యక్రమాల్లో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి శంకర్, మండల ప్రధాన కార్యదర్శి రబ్బానిపాషా, మహమ్మద్, కుర్బాన్ ఆలీ ఉన్నారు.

## సమయపాలన పాటించాలి

లింగాల, జూలై 25 : ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని కాంప్లెక్స్ జీహెచ్‌ఎం బషీర అహ్మద్ అన్నారు. గురువారం అప్పాయిపల్లి, ఎం.సీ తండా, పాఠశాలలను ఆయన సందర్శించి విద్యార్థుల హాజరు శాతాన్ని, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు బోధించాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

## ఆర్థికసాయం అందజేత

ఊర్కొండ, జూలై 25 : మండలంలోని రాచాలపల్లి గ్రామానికి చెందిన జంగమ్మ అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందారు. తన అనుచరులతో విషయం తెలుసుకున్న మాదారం మాజీ సర్పంచ్ ద్యాప నిఖిల్‌రెడ్డి బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ వారి అంత్యక్రియల కోసం రూ.5వేలను తన అనుచరులతో పంపించాడు.

**కోడేరులో..**

కోడేరు, జూలై 25 : కోడేరు మండలం నర్సాయపల్లి గ్రామానికి చెందిన తోల కిష్టయ్య అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆ గ్రామ సింగిల్‌విండో మాజీ చైర్మన్ జంబుల బుచ్చారెడ్డి మృతుని ఇంటికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించి రూ.3వేల నగదును అందజేశారు. ఆయన వెంట డైరెక్టర్లు అర్జునయ్య, అంజి, రాంబాబు, స్వామి ఉన్నారు.

## బీటీ రోడ్డు వేయాలి

బల్మూరు, జూలై 25 : మండలంలోని నార్సయపల్లి గ్రామానికి బీటీ రోడ్డు వేయాలని సీపీఎం పార్టీ నాయకులు శంకర్‌నాయక్, దేశ్యానాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం గ్రామప్రజలతో కలిసి గ్రామంలో గుంతలమయంగా ఉన్న రోడ్డును పరిశీలించారు. బల్మూరు-లింగాల ప్రధాన రాహదారి నుంచి గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వనంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజు, రాయుడు, బాలు, బాలాజీ, గోపాల్, శంకర్ ఉన్నారు.

## పనులు పరిశీలన

వెల్దండ, జూలై 25 : ఈనెల 28న తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కల్వకుర్తికి రానున్న నేపథ్యంలో వెల్దండ మండలం కొట్ర గేటు వద్ద మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి విగ్రహ ఏర్పాటు పనులను కలెక్టర్ సంతోశ్ గురువారం పరిశీలించారు. విగ్రహ ఆవిష్కరణకు సీఎం రేవంత్‌రెడ్డి వస్తున్నందున అన్ని ఏర్పా ట్లు చూసుకోవాలని స్థానిక అధికారులకు సూచించారు. పనులను వేగవంతంగా పూ ర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ ఆశ్రీత్‌కుమార్, తాసీల్దార్ రవికుమార్, వెల్దండ సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటయ్య గౌడ్ తదితరులు ఉన్నారు.

## సీఈవో పోస్టుకు దరఖాస్తు ఆహ్వానం

వెల్దండ, జూలై 25 : మండల కేంద్రంలోని మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీలో చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మహిళ రైతు ఉత్పత్తి దారుల కంపెనీ, డీఆర్డీఏ ఏపీఎం సంతోశ్ గురువారం ప్రకటనలో తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ గారి అనుమతి ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. అగ్రికల్చర్ గ్యాడ్యుయోట్ లేదా అగ్రికల్చర్ మార్కెటింగ్ లేదా అగ్రికల్చర్ మేనేజ్‌మెంట్, బీబీఏ, ఇతర తత్సమాన విద్యా అర్హత కల్గి ఉండాలని పేర్కొన్నారు. కనీసం వ్యవసాయం పై ఒక సంవత్సరం అనుభవం కల్గి ఉండాలన్నారు. అర్హత గల అభ్యర్థులు ఆగస్టు 5వ తేదీలోగా వెల్దండ మహిళ రైతు ఉత్పత్తిదారుల కంపెనీలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

## గురుకుల కళాశాలలో స్పాట్ కౌన్సెలింగ్

బిజినేపల్లి, జూలై 25 : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఎస్సీ గురుకుల, ఒకేషనల్ కళాశాలలో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఈనెల 26, 27వ తేదీల్లో స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు బిజినేపల్లి సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల ప్రిన్సిపాల్ సుమతి గురువారం ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా జనరల్ గురుకుల, ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్లకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. బాలికలకు ఈనెల 26వ తేదీన రాంరెడ్డిగూడ, 27వ తేదీన బాలురకు జేపీ నగర్‌లో గురుకుల పాఠశాల కల్వకుర్తిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.

## ఉప్పునుంతల తాసీల్దార్‌గా సునీత

ఉప్పునుంతల, జూలై 25 : మండల నూతన తాసీల్దార్‌గా సునిత గురువారం బాధ్యతలను స్వీకరించారు. గతంలో తాసీల్దార్‌గా పనిచేసిన శ్రీకాంత్ సూర్యాపేటకు బదిలీ కాగా ఆయన స్థానంలో హైదరాబాద్ నుంచి సునీత ఉప్పునుంతల కు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమస్యలను తక్షణమే పరిష్కరించుటకు కృషి చేస్తానన్నారు. అందరూ సహకరించాలని కోరారు.

## ఇద్దరికి జైలుశిక్ష

కల్వకుర్తి రూరల్, జూలై 25 : కల్వకుర్తి పట్టణంలో మద్యం తాగి పట్టుబడిన(డ్రంక్అండ్ డ్రైవ్ కేసులో) ఇద్దరు వ్యక్తులకు కల్వకుర్తి సివిల్ కోర్టు జైలు శిక్ష విధించినట్లు కల్వకుర్తి ఎస్సై మాధవరెడ్డి గురువారం తెలిపారు. పట్టణంలో పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీల్లో కల్వకుర్తికి చెందిన దర్వేశ్, తెల్కపల్లి మండలం గౌరారం గ్రామానికి చెందిన ఇదమయ్యలు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డారు. వారిని కోర్టులో గురువారం హాజరుపర్చగా కోర్టు వారికి రూ. 100ల జరిమానాతోపాటు రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు ఎస్సై వెల్లడించారు.

## పోల్కంపల్లిలో చోరీ

వంగూరు, జూలై 25 : పట్టపగలు తాళం వేసిన ఇంట్లోకి గుర్తు తెలియన వ్యక్తులు చొరబడి నగదు, బంగారాన్ని అపహరించుకుపోయిన ఘటన మండలంలోని పోల్కంపల్లిలో బుధవారం చోటు చేసుకున్నది. ఎస్సై మహేందర్ కథనం మేరకు మండలంలోని పోల్కంపల్లిలో కేశమోని సుదర్శన్‌గౌడ్ ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనుల కోసం పొలం వద్దకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లికి ఇంటి తాళాలు విరగ్గొట్టి ఉండడంతో వెంటనే సుదర్శన్‌గౌడ్‌కు సమాచారమిచ్చింది. వచ్చి చూడగా బీరువాను ధ్వంసం చేసి తులం బంగారం, 28 తులాల వెండి, కొంత నగదును దొంగిలించినట్లు గుర్తించారు. వెంటనే 100 డయల్ చేశారు. దీంతో వెంటనే ఘటన స్థలానికి పోలీసులు చేరుకుని పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## రైతులకు అవగాహన

పెద్దకొత్తపల్లి, జూలై 25 : మండలంలోని కోడేరు, సాతాపూర్ గ్రామాల్లో రైతు వేదికల వద్ద రుణమాఫీ, రైతుబీమా పథకాలపై వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతులు పంటల సాగు కోసం తీసుకున్న పంట రుణాల్లో రూ.లక్ష వరకు రుణమాఫీ చేసిందని, అదేవిధంగా వచ్చే నెల 15వ తేదీ వరకు ప్రతి రైతుకు రూ.2లక్షల వరకు ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని, రుణమాఫీ కాని రైతులు సంబంధిత వ్యవసాయాధికారుల వద్ద సమాచారం తెలుసుకోవాలన్నారు. సమావేశంలో ఏవోలు శిరీష, రమేశ్‌నాయక్, ఏఈవోలు ముజీబ్ పాల్గొన్నారు.